

# రాధామోహనం

## – దేవరకొండ అన్నపూర్ణ



*ఇది ఒక అందమైన రాధామోహనగాథ. మనందరిలోను అంతర్లీనంగా ఉండి కాలప్రవాహంలో పడి మరిచిపోతున్న ప్రేమాభిమానాలనీ అనుభూతులని గుర్తు చేస్తూ, మనల్ని నవ్విస్తూ, అప్పుడప్పుడూ కళ్ళని చెమరుస్తూ, పనిలోపనిగా మరిచిపోతున్న విలువల్నీ మనుషులుగా మన బాధ్యతలనీ తట్టిలేపే కథామాలిక..!!*

10

## ఏ తీగ పూవునో ఏ కొమ్మ తేటినో

ఏ తీగ పూవునో ఏ కొమ్మ తేటినో కలిపింది ఈ వింత అనుబంధమౌనో తెలిసీ తెలియని అభిమానమౌనో.. కార్ స్టీరియో లో పాట వస్తుంటే కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి రుక్మిణికి.

పొద్దున మోహన్ 'క్రూజ్ కి టికెట్స్ బుక్ చేసాను' అని ఫోన్ చెప్పినప్పటి నుంచి ఉవ్వెత్తున ఎగసిపడుతున్న ఆలోచనా తరంగాలు, దానికి తోడు ఈ పాట.

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

షెర్లాక్ హోమ్స్, షాడో నవల్స్ తెగ చదివేస్తూ గలగల తిరుగుతూ, పుస్తకాల పురుగు, వస పిట్ట అని బామ్మ ముద్దుగా పిలుచుకునే రుక్మిణి రామచంద్రపురం వచ్చింది చినరాజు గారి కార్లో.

తాతగారు పోవడంతో తోడుగా రుక్మిణిని తనతో ఉంచమని అడిగింది బామ్మ. దాంతో పెద్ద రాజు గారి వీలునామా ప్రకారం ఆస్తి పంపకాలు చేసి చెల్లెళ్ళకి ఇవ్వాల్సిన ఆస్తి దస్తావేజులు అన్నీ ఇచ్చి వస్తూ వస్తూ రుక్మిణిని తీసుకుని విశాఖ పట్నం నుంచి వచ్చారు చినరాజు గారు. 'అందరూ విశాఖపట్నం వెళ్ళిపోయినా ఇంకా ఇంకెక్కడెందుకు అమ్మా' అనడిగినా తల్లి ఆ ఇంటిని వదలి రాదని తెలియడంతో ఆయనకి రుక్మిణిని రామచంద్రపురం తీసుకురాక తప్పలేదు. వచ్చే ముందు పిల్లని పిలిచి –

'బామ్మ దగ్గరికి వెళ్తావా అక్కడే నాలుగో తరగతి చేరాలి మరి'

రెండు జెడలు అటునుంచి ఇటు తిప్పి మెడ చుట్టూ పడేలా వేసుకుని, రెండు చేతులూ నడుముపై వేసుకుని

"సరే మరి నాకు నెలకో సినిమా, వారం వారం పుస్తకాలు తెచ్చిపెట్టమని అప్పిగాడికి చెబుతానంటే అలాగే వెళ్తాను"

ఆ చురుకైన కళ్లల్లో బామ్మ మీద ప్రేమ, అమ్మ, నాన్న, అన్నయ్యల మీద బెంగ – అన్నీ తొంగి చూస్తున్నా వాటన్నింటినీ దాచేసి 'నేను రుక్మిణి' అన్న ఫోజ్ పెట్టింది.

వచ్చే ముందు రుక్మిణి అడిగిన 'రుద్రవీణ' సినిమా చూపించి, విశాలాంధ్ర బుక్ హౌజ్ లో అడిగిన పుస్తకాలు అన్నీ కొని ఒక ట్రంక్ పెట్టె నిండా నింపి తీసుకుని వచ్చినా, ఆ తండ్రికి పట్నం లో చదువుతున్న కూతురు ఈ చిన్న వూరిలో ఇమడగలదో లేదో అన్న అనుమానం ఉండనే ఉంది.

రాగానే అప్పిగాడు ఎదురు వచ్చి

"చిన్న మారాణి వచ్చారేటమ్మా, ఇంక సంబరాలేనండి మరి" అన్నాడు పెట్టె కోసం డిక్కీ తెరుస్తూ.

లచ్చి ఎదురొచ్చి ఎర్ర నీళ్ళ దిష్టి తీసి కళ్ళు కాళ్ళూ కడిగి లోపలికి తీసుకెళ్ళినప్పటి నుంచీ ఆ ఇంటి రాకుమారి అయ్యింది రుక్మిణి.

వేసవి సెలవులకి ఎప్పుడూ వచ్చే ఊరే ఐనా తాతగారు లేకపోవడం, అంత పెద్ద ఇంట్లో బామ్మ తో ఉండటం వల్ల అక్కడ పద్దతులు కొత్తగా అనిపించినా, బామ్మ కోసం అనుకుంటూ అవన్నీ ఆకళింపుచేసుకుని అలవర్చుకునే ప్రయత్నంలో ఉన్న రోజులు. బామ్మని తనే చూసుకోవాలని గుర్తొచ్చినప్పుడల్లా ఏదో తెలియని బలం ఆ పసి గుండెలో.

సెలవలు అవ్వగానే స్కూల్ టీచర్ ఇంటికి వచ్చి క్లాసు పుస్తకాల చిట్టా అదీ ఇచ్చి స్కూల్ టైం చెప్పి బామ్మ దగ్గర సెలవు పుచ్చుకుని వెళ్లటం ఆశ్చర్యంగా అనిపించింది రుక్మిణికి . రిక్షాలో స్కూల్ దాకా తనతో పాటు వచ్చిన లచ్చి బేగ్ – క్లాస్ రూం దాకా తెస్తాను అంటే వద్దు అని తీసుకుని క్లాసుకి వెళ్తుంటే కనిపించిందా దృశ్యం.

"కృష్ణుడూ, క్యారేజీ మరిచిపోయావురా అబ్బీ" అని రొప్పుతూ వస్తున్న ఒక పెద్దావిడ. అరవై పైబడ్డ వయసు, తెల్లచీర కచ్చాపోసి కట్టి కొంగుని తల మీదుగా లాగి బొడ్డులో దోపుకున్న రూపం, ఎడం చేతిలో క్యారేజీ, కుడి చేతిలో నీళ్ల బాటిల్ పట్టుకుని గేట్ లోకి వస్తోంది ఆవిడ. గేట్ మేన్ ఆవిడ వైపు పరిగెత్తుకుంటూ వెళ్ళాడు.

"మీ వాడిని పిలుస్తాను ఉండడమ్మా"

"అసింటా ఉండు, ముట్టుకున్నావంటేనా. నేను పిలుచుకోగలను మా పిల్లడిని. కృష్ణుడూ, కృష్ణుడూ.. ఎక్కడున్నావ్ రా అబ్బీ, అవతల మహానైవేద్యానికి వేళవుతోంది"

నాలుగో తరగతి అని వ్రాసి ఉన్న క్లాస్ రూం లో నుంచి ఆవదం తాగిన మొహం పెట్టుకుని బయటికి వచ్చాడు ఒక అబ్బాయి. ఒక్క ఉదుట్న క్లాస్ రూం బయట ఉన్న పిట్టగోడ దూకి గ్రౌండ్ లో గేట్ వైపు పరిగెట్టుకెళ్తుంటే ఫక్కున

నవ్వింది రుక్మిణి. ఒక్కసారి తలతిప్పి కరిచేలా చూసిన అతని చూపు సెకన్లలోనే ఆశ్చర్యంతో తీరు మార్చుకుంది. మళ్లీ మామూలయ్యి ఆ పెద్దావిడ దగ్గరికి వెళ్ళాడు.

"ఎన్ని సార్లు చెప్పాను అమ్మమ్మా స్కూల్ కి రావద్దని. కాళ్లు నొప్పులెట్టవూ"

"వెర్రినాయన, మొహం చూడు ఎంత ఈడ్చుకుపోయిందో, ఏమీ తినకుండా, క్యారేజీ తెచ్చుకోకుండా వస్తే ఎలాగరా అయ్యా. ఇంద ఈ అర్ధరూపాయి పెట్టి జీళ్ళు కొనుక్కో"

బొడ్లో దోపిన కొంగుముడిలోనుంచి అర్ధ రూపాయి బిళ్ళ తీసి మనవడి చేతిలో పెట్టింది ఆవిడ.

ఆవిడని గేట్ దాటించి రిక్షా పిలిచి కూర్చోబెట్టి తన జేబులోనుంచి రూపాయి తీసి రిక్షావాడికిచ్చి పంపి ఆ అబ్బాయి స్కూల్ లోపలకి వచ్చేదాకా అలాగే చూస్తూ నిల్చుంది రుక్మిణి.

ఆ అబ్బాయి క్లాస్ దగ్గరికి రాగానే మళ్ళీ తలతిప్పి రుక్మిణి వైపు చూసాడు. వడివడిగా అడుగులు వేసుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

టీచర్ వచ్చాక అటెండెన్స్ రిజిస్టర్ తెమ్మని ఒక సారి, చాక్ పీసులు తెమ్మని ఇంకోసారి

'మోహన్! , మోహన్! '

అని పిలుస్తుంటే అదే పిల్లవాడు లేచి వెళ్ళడం చూసి, పేరు మోహన్ ఐతే మరి వాళ్ల అమ్మమ్మ గారు కృష్ణుడు అంటుందేవిటి అనుకుంది మనసులో.

"రోల్ నంబర్ ముప్పైఆరు – పీ. రుక్మిణి "

మాస్టారి పిలుపుతో ఉలిక్కి పడింది.

"ప్రెజెంట్ సార్"

ఉలికిపాటుతో చుట్టూ చూసి కూర్చుంది. మోహన్ రుక్మిణి వైపు చూసి తల తిప్పుకోవడం తనకి అప్పుడు తెలియదు.

అలా మొదలైన రామచంద్రపురంలో రాకుమారి ప్రస్థానం, మోహన్ రుక్మిణి మంచి నేస్తాలయ్యి చదువులోనూ పాటల పోటీల్లోనూ పోటాపోటీగా మారి పదో తరగతి పాసయ్యేదాకా సాగింది.

ఆ ఆరేళ్ళల్లోనూ మోహన్ కుటుంబానికి చాలా దగ్గరయ్యింది, ఎన్నో నేర్చుకుంది రుక్మిణి. మోహన్ తండ్రి డాక్టర్, తల్లిదండ్రులు ఇద్దరూ ఢిల్లీలో రోడ్ ఆక్సిడెంట్ లో మరణించడంతో మోహన్ నీ, వాళ్ళ అక్కనీ తీసుకుని వచ్చి అన్నీ తనై పెంచుతున్నారు మోహన్ మేనమామ. సాధారణ పూజారి కుటుంబం, చాలీ చాలని ఆదాయంతో నెట్టుకొస్తున్న జీవితం, ఆపై ఇలా ఆడపడుచు పిల్లల బాధ్యత కూడా తమ మీదే పడటంతో మోహన్ మేనమామ భార్య కొంత అసంతృప్తితో ఉన్నా, ఇంటి పెత్తనం అంతా పెద్దావిడదే. వచ్చిన ఆదాయంతో గుట్టుగా ఇల్లు నడిపి, సంసారం అంతా కట్టుగా నడిపించేది

ఆవిడ. మోహన్ కి అమ్మమ్మ అంటే పంచ ప్రాణాలు. ఆవిడ మోహన్ ని ఎంత ప్రేమగా చూసేదో దానికి తగ్గట్టే అమ్మమ్మకి తలలో నాలుకలా ఉండేవాడు మోహన్. మోహన్ అక్క మాధవి అప్పట్లో గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో గణితంలో డిగ్రీ చదువుతుండేది. రుక్మిణి కి మాధవికి మంచి స్నేహం, ఇద్దరూ సినిమా కబుర్లు చెప్పుకుని సినిమా పాటలు పాడుకుంటూ ఉండే వారు, మోహన్ మాత్రం పుస్తకాల పురుగులా చదువుకుంటుంటే అతని మీద జోకులు వేస్తూ.

మాధవి ద్వారానే తెలిసింది, 'తాత గారి పేరు పెట్టడం వల్ల మోహన్ ని పేరు పెట్టి పిలవకుండా కృష్ణుడూ అంటుంది అమ్మమ్మ' అని, మోహన్ ని మేనమామ ఏకైక కూతురికి ఇచ్చి పెళ్ళి చెయ్యాలని ఆవిడ కోరిక అనీను.

తన ఇంట్లో  ప్రేమాభిమానాలు, మోహన్ ఇంట్లో వాతావరణం ఎంత భిన్నంగా ఉన్నాయో ప్రతీరోజూ స్పష్టంగా తెలిసేది రుక్మిణికి.తనూ మోహన్ ఇంట్లో పుట్టి ఉండకూడదా అనుకునేది రుక్మిణి.

కోట్ల ఆస్తి ఉన్నా  బామ్మను వదిలేసి తమ తమ జీవితాల్లో బిజీ అయిపోయిన నాన్న, మేనత్తలు ఒక ప్రక్క – చాలీచాలని ఆదాయంతో నెట్టుకొస్తున్నా తల్లినీ, చెల్లెలి పిల్లల్నీ కూడా ప్రేమగా సాకుతున్న మోహన్ మేనమామ ఇంకో ప్రక్క.

రామచంద్రపురం వచ్చినప్పుడల్లా ఒక్కసారి కూడా వంటింట్లోకి వెళ్ళక్కర్లేదని సంతోషించే రుక్మిణి అమ్మ ఒక ప్రక్క – 'వంటా వార్పూ అంతా పెద్దావిడ పెత్తనమే, నా చేతికెప్పుడు పగ్గాలొస్తాయో' అని సన్నాయి నొక్కులు నొక్కే మోహన్ అత్త ఇంకో ప్రక్క.

తనేదో బామ్మని చూసుకోవాలని ఇక్కడికి వచ్చి సర్వ సుఖాలు అనుభవిస్తున్న తను ఒక ప్రక్క, తనని ప్రాణంగా చూసుకునే బామ్మకి చిన్న బాధ కలిగినా తల్లడిల్లిపోయే మోహన్ మరో ప్రక్క.

మోహన్ తనని కూడా అంతే ప్రేమగా చూసేవాడు అనుకునేది రుక్మిణి. కొన్నిసార్లు వాళ్ళ అమ్మమ్మకి మందులకోసమో లేకపోతే డాక్టర్ పని మీదో వెళ్ళి తనతో మాట్లాడకపోతే కోపం కూడా వచ్చేది రుక్మిణికి. కానీ చెబితే మోహన్ ఏమంటాడో అన్న భయం.

ఇవన్నీ బామ్మతో చెబితే బామ్మ నవ్వుతూ,

"నీ పేరు రుక్మిణి అని తప్పు పెట్టారే బాబూ. నువ్వు సత్యభామ రకం.  ఈ అంతరాలు తరతరాలుగా మనుషులు కట్టుకున్న గోడలే  తల్లీ, చెరపడం నీ తరం నా తరం కాదు.బాగా చదువుకుని నీ కాళ్ళ మీద నువ్వు నిలబడ్డ రోజు ఆలోచించవచ్చు. మోహన్ ది మల్లెపువ్వులాంటి స్వచ్ఛమైన మనసు. అతనికి అలాంటి ఆలోచనలు ఉన్నాయనుకోను. ఆ తర్వాత నీఇష్టం"  అంది.

అది రుక్మిణి పదో తరగతి చదువుతున్న సంవత్సరం (1995) మార్చి నెల. స్కూల్లో ప్రిపరేషన్ సెలవులు ఇచ్చారు. ఆ రోజు సాయంత్రమే ఫేర్వెల్ పార్టీ. ఆటోగ్రాఫు పుస్తకం తెమ్మని అప్పిగాడికి చెబితే ఏదో పిచ్చి పుస్తకం తెచ్చాడు. నాన్నని

అడిగితే, అన్నయ్య రాకేష్ తో  మంచి ఆటోగ్రాఫు పుస్తకం పంపుతాను అన్నారు, ఆ రోజు పొద్దున్నే వచ్చాడు అన్నయ్య వైజాగ్ నుంచి.

కార్లోనుంచి దిగి ఇంట్లోకి వస్తూనే

"కంట్రీ బ్రూట్స్, ఈ రోడ్ల మీద మనుషులు గేదెలు ఒకేలాగ తిరుగుతుంటే మన కార్ వెళ్లే ప్లేస్ లేదు. పైగా డర్టీ రోడ్స్, ఆపై బురద పడితే శాపనార్థాలూ. ఇంత కామన్ సెన్స్ లేని చోట నువ్వెలా ఉంటున్నావో.. ఇంత పాటి ఊరికి ఓ స్కూలూ, అందులో చదివేవాళ్ళ ఆటోగ్రాఫులు తీసుకోవడం కోసం నీకు పుస్తకం ఇమ్మని నాన్న నన్ను వైజాగ్ నుంచి పంపడం. నెక్స్ట్ మంత్ నేను అమెరికా వెళ్తున్నా, నువ్వు కూడా ఇంటర్మీడియట్ అవ్వగానే.... "

"అన్నయ్యా!" గొంతులో ఒకింత అసహనం ధ్వనిస్తుంటే  రాకేష వాక్ప్రవాహాన్ని అడ్డుకుంది రుక్మిణి. ఇంతలోనే

"రుక్మిణీ, రాజమండ్రి నుంచి మనిద్దరికీ చెరొక ఆటోగ్రాఫు బుక్ తెచ్చాను చూడు" అంటూ అలవాటుగా ఇంట్లోకి వచ్చాడు మోహన్.

రాకేష్ మోహన్ ఒకరి వైపు ఒకరు చూసుకున్నారు. ఇంజనీరింగ్ చేసి ఎమ్మెస్ చేయడానికి మరో నెలలో  అమెరికా బయల్దేరబోతున్న రాకేష్ రూపం ఖరీదైన జీన్స్, టీ షర్ట్, రేబాన్ గ్లాసెస్, నిర్లక్ష్యంగా పైకి తోసిన హెయిర్ స్టైల్ తో–  ఎగసి పడే ఉప్పెనలా ఉంటే, మోహన్ రూపం ఫేర్వెల్ పార్టీకని వాళ్ళ అమ్మమ్మ కుట్టించిన బాగీ ప్యాంట్, ఫుల్ హేండ్స్ తెల్ల చొక్కా, కుదురుగా దువ్విన జుట్టు, నుదుటిపై చిన్న విభూతి రేఖ, పరుగెత్తుకుంటూ రావడం వల్లో సైకిల్ తొక్కడం వల్లో వచ్చిన చిన్నపాటి రొప్పుతో, మొహంలో చెదరని ప్రశాంతతతో –  సముద్రంలా గంభీరంగా  ఉంది.

"అన్నయ్యా, మోహన్ .. నా ఫ్రెండ్! మోహన్, మా అన్నయ్య రాకేష్"

పరిచయాలు చేసింది రుక్మిణి. కేర్ లెస్ గానే చేయి చాపేడు రాకేష్. ఒక్క అడుగు ముందుకేసి చేయి కలిపి బలమైన కరచాలనం చేసి

"గుడ్ టు సీ యు, రాకేష్. వెన్ ఆర్ యూ ఫ్లయింగ్" అన్నాడు మోహన్

"హేయ్, నాట్ బేడ్ ఫర్ దిస్ హేమ్లెట్"

ఆ మాటల్లో వ్యంగ్యాన్ని వెంటనే గుర్తు పట్టాడు మోహన్. రుక్మిణి వైపు తిరిగి

"ఇదిగో రుక్మిణీ, నీ పుస్తకం. ఇందాకా అమ్మమ్మ  గుడికి వెళ్ళి వస్తుంటే పెద్దవీధిలో ఎవరిదో కారు ఫాస్ట్గా బురదనీటిలోనుంచి వెళ్ళినపుడు ఈవిడ మీద బురద చిందిందట.

'ఏమిటీ కళ్ళానట్లేదా'  అంటే ఏదో ఇంగ్లీష్ లో తిట్టి వెళ్ళిపోయారట. పాపం నొచ్చుకుంది. ఇంటికి వచ్చాక – 'నువ్వు కూడా కార్ కొన్నాక అలా ఎవరూ ఉసురు పోసుకోకు నాయనా, చిన్న స్థాయి నుంచి వచ్చిన వాడు కూడా పెద్ద స్థాయికి ఎదగవచ్చు, సాటివాడిని చిన్న చూపు చూస్తే మాత్రం అది వృద్ధి నిరోధకమే' అంటూ మాట్లాడుతూ కూర్చుంది.

నీకు పుస్తకం ఇచ్చేసి వస్తానని చెప్పి వచ్చాను. కనుక ఇవాళ కంబైన్డ్ స్టడీస్ కి రాలేను. ఆవిడ మళ్లీ స్నానం చేసి పూజకు కూర్చుంది. నేను వెళ్లి ఆవిడతో భోజనం చేసి మధ్యాహ్నం చదువు మొదలుపెడతాను. ప్రిపరేషన్ హాలిడేస్ లో గట్టిగా చదవకపోతే కష్టం. నువ్వు కూడా కాస్సేపు చదువు. సాయంత్రం పార్టీ లో కలుద్దాం.”

“థాంక్స్, మరి నా…”

రుక్మిణి ఏదో అనబోతుండగా లచ్చి చేతిలో ట్రేతో అక్కడికి రావడం, కాఫీ కప్పుని మోహన్ చేతికి అందించడం, ఈ లోపు అప్పిగాడు రావడం జరిగాయి.

“అయ్యగోర్ల అబ్బాయిని నిల్సోబెట్టి మాటాడతారేంటి రాణెమ్మ! బామ్మగోరొప్పరు. మీరు కూకోండి బాబూ”

అప్పిగాడు మాటలు వినగానే అప్పటిదాకా జరుగుతున్నవన్నీ చూస్తున్న రాకేష్ కి కోపం నషాళానికంటింది.

“దిస్ ఈజ్ క్రేజీ” అని చేతిలో హిందూ పేపర్ ని నేలకి విసిరికొట్టి విసురుగా లోపలికి వెళ్ళిపోయాడు.

మోహన్ రుక్మిణి వైపు చూసి నర్మగర్భంగా ఒక నవ్వు నవ్వి –

“వస్తాను రుక్మిణీ” అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత రాకేష్ చేసిన రాద్ధాంతం ఇంతా అంతా కాదు. బామ్మ గారు

‘మోహన్ తల్లిదండ్రులు లేని బిడ్డనీ, గుడిలో అయ్యవారి మేనల్లుడనీ, అమ్మమ్మ ఇంట్లో మేనమామ దగ్గర పెరుగుతున్నాడనీ, చాలా తెలివైన పిల్లవాడనీ బుద్ధిమంతుడనీ’ సర్ది చెప్పినా,

“మీరందరూ ఒకటై దీనిని చెడగొడుతున్నారు. అబ్బాయిలతో స్నేహాలు ఏమిటి? కంబైన్డ్ స్టడీస్ ఏమిటి? పెద్ద దానవి నీకైనా తెలియక్కర్లా. పరీక్షలవ్వగానే నిన్నూ రుక్మిణినీ వైజాగ్ తీసుకెళ్లమని నాన్నకి చెప్తాను”

అని రుక్మిణి వైపు తిరిగి

“మూడో క్లాసులోనే ఇంగ్లీష్ నవలలు చదివేదానివి నువ్వు. ఎటు నుంచి ఎటు పోతున్నావో చూస్కో” బయలుదేరి వెళ్ళిపోయాడు రాకేష్.

రుక్మిణి నిర్ఘాంతపోయింది. బామ్మ దగ్గరికి వెళ్ళి ఒక్క సారి కౌగలించుకుని తన రూం లోకి వెళ్లిపోయింది.

ఆ రోజు సాయంత్రం ఫేర్వెల్ పార్టీలో రుక్మిణి

“ ఏ తీగ పూవునో. ఏ కొమ్మ తేటినో.
కలిపింది ఏ వింత అనుబంధమౌనో…
తెలిసీ తెలియని అభిమానమౌనో…”

అని పాడటం మొదలు పెట్టగానే

" మనసు మూగది. మాటలు రానిది

మమత ఒకటే.అది నేర్చినది"

అని గొంతు కలిపాడు మోహన్ స్టేజ్ మీదకి వచ్చి.

తరవాత అందరూ ఆటోగ్రాఫు పుస్తకాలలో సంతకాలు పెడుతుంటే – మోహన్ పుస్తకం రుక్మిణి దగ్గరికి వచ్చింది. దానిలో "ఐ లవ్ యూ" అని రాసి తన బేగ్ లో పెట్టేసుకుంది. పార్టీ అంతా అయ్యాక అందరూ పుస్తకాలు కలెక్ట్ చేసుకుంటుంటే మోహన్ వచ్చి

"బయల్దేరదామా, నా పుస్తకం కనబడలేదు. నీది వచ్చిందా? అందరూ వ్రాసారా? "

అని అడిగాడు.

"నీది కూడా నేను కలెక్ట్ చేసుకున్నాలే, పద" అంది రుక్మిణి కార్ వైపు నడుస్తూ.

అప్పిగాడు, డ్రైవర్ కొంచెం దూరంలో ఉన్నారనగా నెమ్మదిగా

"అక్కకి చూపించకు" అంది రుక్మిణి బేగ్ లో నుంచి మోహన్ ఆటోగ్రాఫ్ పుస్తకం బయటికి తీస్తూ.

తల తిప్పి చూసాడు మోహన్. మోహన్ చెయ్యి పట్టుకుని నెమ్మదిగా వత్తి వదిలేసింది.

ఆ తర్వాత పరీక్షల దాకా మోహన్ కనబడలేదు. అప్పిగాడి తో కబురు పెడితే 'బిజీ గా ఉన్నాను' అన్నాడు. డ్రైవర్ ని తీసుకుని మోహన్ ఇంటికి వెళితే ఏమీ జరగనట్లు మామూలుగానే మాట్లాడేడు మోహన్. పుస్తకం మాట ఎత్తలేదు. కంబైన్డ్ స్టడీస్ కి రమ్మంటే –

"పెరట్లో ఏవో పనులు జరుగుతున్నాయి. అమ్మమ్మకి సాయం కావాలి అందుకే కుదరట్లేదు"

అని చెప్పాడు.

పదో తరగతి చివరి పరీక్ష అయ్యి ఇంటికి రాగానే రుక్మిణి బామ్మ కాలం చేయడంతో, కార్యక్రమాలు అన్నీ పూర్తి చేసుకుని, ఇల్లు తాళం పెట్టి రుక్మిణిని తీసుకుని విశాఖపట్నం వెళ్ళిపోయారు చిన రాజు గారు. వెళ్ళే దాకా వెంటే ఉండి సాగనంపిన మోహన్ అంటే చినరాజు గారికి కూడా మంచి అభిప్రాయం కలిగింది.

రుక్మిణి – మాధవి ఉత్తరాలు వ్రాసుకోవడం వల్ల ఎప్పటికప్పుడు క్షేమ సమాచారాలు తెలిసేవి.

పదోతరగతి పరీక్షల్లో స్టేట్ తొమ్మిదో ర్యాంక్ వచ్చింది మోహన్ కి. రుక్మిణి సరిగ్గా చదవకపోవడంతో మంచి మార్కులైతే వచ్చాయి కానీ స్టేట్ ర్యాంక్ ఐతే రాలేదు. విజయవాడ నలంద కాలేజీ నిర్వాహకులు మోహన్ ఇంటర్మీడియట్ మొత్తం ఫ్రీగా చదవవచ్చు అని ఇంటికి వచ్చి పిలవడంతో మోహన్ విజయవాడ హాస్టల్ లో చేరాడు. తండ్రికి చెప్పి తను కూడా పట్టు పట్టి అదే కాలేజీ లో చేరింది రుక్మిణి. మోహన్ అంటే ఉన్న సదభిప్రాయం, పైగా అతని ర్యాంకు చూసి చినరాజు గారు కూడా రుక్మిణి మాట కాదనలేదు.

హాస్టల్ కేంపస్ లోనే కాలేజీ, అబ్బాయిలదీ అమ్మాయిలదీ వేర్వేరు కాంపస్ లు కావడంతో మోహన్., రుక్మిణి కలిసేవారు కూడా కాదు. అందువల్ల కేంపస్ టు కేంపస్ ఉత్తరాలు రాసుకునే వారు. సెలవలు వచ్చినపుడు చినరాజు గారు రుక్మిణి తో పాటు మోహన్ ని కూడా బయటికి తీసుకుని వెళ్ళి కావాల్సినవి కొనిపెట్టేవారు. అప్పుడప్పుడు మాధవి కూడా వచ్చి ఇద్దరినీ చూసి వెళ్ళేది.

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అవ్వగానే సెలవల్లో మోహన్ అమ్మమ్మకి బాగా జబ్బు చేసింది. దానితో మోహన్ రెండో సంవత్సరం కాలేజీ కి వెళ్ళకుండా ఇంటి దగ్గరే చదువుకుని పరీక్షకి కడతానని పట్టుబట్టాడు. ఇంట్లో అందరూ మోహన్ ని ఒప్పించి రెండో సంవత్సరం కాలేజీకి పంపిన నాలుగు రోజులకే అమ్మమ్మ కాలం చేయడం, ఇంట్లో వాళ్ళు సంవత్సరం లోపే ఇంట్లో పెళ్ళి జరగాలని మాధవికి బెంగుళూరు సంబంధం చూసి పెళ్లి చేయటం జరిగాయి. మోహన్ మాత్రం దాని నుంచి తేరుకోలేక పోయాడు. రుక్మిణి ధైర్యం చెప్పినా మెడికల్ ఎంట్రన్స్ కూడా రాయలేదు మోహన్.

మాధవి భర్త కిరణ్ బెంగుళూరు లో సాఫ్ట్వేర్ ఇంజనీరు. చాలా మంచి వ్యక్తి. మాధవి మాటలపై మోహన్ ని ఇంటర్మీడియట్ అవ్వగానే బెంగుళూరు ఎమ్మెస్ రామయ్య ఎంట్రన్స్ రాయించి, ఫీజ్ కట్టి జాయిన్ చేసారు. రుక్మిణి కూడా అక్కడే జాయిన్ అయ్యింది.

మోహన్, రుక్మిణి చిన్నప్పటి నుంచి స్నేహితులు అని కాలేజీ అంతా తెలిసిపోవడమే కాదు, క్లాసులో ఐనా క్యాంటీన్ లో ఐనా కలిసే కనిపించేవారు వాళ్ళిద్దరూ. దానితో పుకార్లు షరా మామూలుగా షికార్లు చేస్తుంటే మోహన్ కొట్టి పడేసేవాడు, రుక్మిణి మాత్రం వినగానే నవ్వి వెళ్ళిపోయేది.

ఎం.బీ.బీ ఎస్ మొదటి సంవత్సరంలో ఉండగా రుక్మిణి అన్నయ్య రాకేష్ అమెరికా నుంచి వచ్చాడు. కాలేజీకి వచ్చి రుక్మిణిని పికప్ చేసుకుంటున్నటైంలో మోహన్ రుక్మిణి చాలా క్లోజ్ గా ఉండటం గమనించి ఇంటికి వచ్చి చినరాజు గారి మనసులో విష బీజం నాటాడు. చినరాజు గారు నిలదీస్తే రుక్మిణి నిజం చెప్పేసింది, తను ప్రేమిస్తున్న మాట వాస్తవం అనీ, కానీ మోహన్ కి మాత్రం తెలియదనీ చెప్పేయటం వల్ల చినరాజు గారు ఉన్నఫళంగా కాలేజీ మాన్పించి రాకేష్ తో అమెరికా పంపించేసారు రుక్మిణిని.

తండ్రి హఠాత్తుగా కాలేజీ మానిపించడంతో, వెళ్ళే ముందు మాధవికి చూచాయగా జరిగిన సంగతి చెప్పి వెళ్ళింది రుక్మిణి.

ఆ తర్వాత కొన్నినెలల పాటు మాధవితో ఫోనులో మాట్లాడేది రుక్మిణి. తర్వాత కిరణ్, మాధవిలు కెనడా మూవ్ అయిపోవడంతో రుక్మిణి తో కాంటాక్ట్ కట్ అవ్వడమే కాదు, మోహన్ కూడా ఒంటరి వాడయ్యాడు.

మోహన్ కి అమ్మమ్మ పోయాక రుక్మిణి స్నేహితురాలిగా చాలా దగ్గరయ్యింది, కానీ ఏనాడూ ప్రేమ అనే భావనలో లేదు. ఒక్కసారిగా రుక్మిణి వెళ్ళిపోవడం, తర్వాత మాధవి– కిరణ్ లు కూడా కెనడా వెళ్ళిపోవడంతో మోహన్ తన ఒంటరితనాన్నీ, ఆవేదననీ – మౌనంగా, ఆ మౌనాన్ని – ధ్యానంగా మార్చుకుని ఆధ్యాత్మికత వైపు అడుగులు వేసాడు.

రుక్మిణి మాత్రం మోహన్ ఆలోచనలనుంచి బయట పడలేదన్నది వాస్తవం.

తర్వాత మోహన్ కెనడావచ్చి మాస్టర్స్ చెయ్యడం, రాధతో పెళ్ళి తదితర విషయాలు తరువాత రుక్మిణి కి తెలిసినా తను మాత్రం వేరెవర్నీ ఆ స్థానంలో అంగీకరించలేకపోయింది.

మోహన్ ఆర్నెల్ల క్రితం కెనడాలో కలిసేదాకా మోహన్ కీ రుక్మిణి కీ కూడా జరిగినవన్నీ పూర్తిగా తెలియదు. అప్పటినుంచీ రెగ్యులర్ గా మాట్లాడుతుంటే ఎడారిలో ఎండమావిలా అనిపిస్తోంది రుక్మిణికి

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

ఇప్పుడు రుక్మిణి ని మోహన్ ఉంటున్న ఊరికి మూవ్ అవ్వమంటున్నాడు. దానితో మోహన్ ప్రేమని వేరెవ్వరితోనూ పంచుకోలేని రుక్మిణి, కళ్ళ ఎదురుగా రాధ కనబడితే ఎలా అన్న అంతర్మధనంలో ఊగిసలాడుతూంటే, ఇప్పుడీ క్రూజ్ ప్లాన్ వచ్చి పడింది.

ఆలోచనలతో పోటాపోటీగా స్పీడో మీటర్ పరిగెడుతూ ఉండగా ఫోన్ మోగింది

డాష్ బోర్డ్ వైపుచూసింది కాలర్ ఐడీ కోసం. రాధ..!! భృకుటి ముడిపడింది రుక్మిణికి.

*(వచ్చే నెల మరో మోహనం)*

Post your comments